## క్లుప్తంగా

### పౌష్టికాహారంతో ఆరోగ్యం

గోస్పాడు: పౌష్టికాహారంతో ఆరోగ్యం చేకూరుతుందని మండల వైద్యాధికారి కాంతరావునాయక్ పేర్కొన్నారు. స్థానిక కస్తూర్బా పాఠశాలలో గురువారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బాలికలు యుక్త వయస్సులో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. సమతుల ఆహారం తీసుకోవడం, ఐరన్ అధికంగా ఉండే ఆకు కూరలు, కూరగాయలు, పాలు, గుడ్లు వంటివి తీసుకోవాలని సూచించారు. అనంతరం 153 మంది విద్యార్థినులకు హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించి రక్తహీనత వల్ల కలిగే నష్టాలపై అవగాహన కల్పించారు.

### 10న ముగ్గుల పోటీలు

నంద్యాల(వ్యవసాయం): సంక్రాంతి పండుగను పురస్కరించుకొని ఈనెల 10వ తేదీన మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నట్లు శిల్పా నాగినిరెడ్డి గురువారం తెలిపారు. ఆమె మాట్లాడుతూ స్థానిక టెక్కె మార్కెట్‌యార్డులో నిర్వహించే పోటీల్లో చుక్కల ముగ్గులు మాత్రమే వేయాలని చెప్పారు. విజేతలకు వరుసగా రూ.15వేలు, రూ.10వేలు, రూ.5వేలు అందజేస్తామన్నారు. పోటీల్లో పాల్గొనే వారు కోవిడ్ నిబంధనలు పాటించాలని, వివరాలకు సెల్: 8885014005 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

### రైల్వేస్టేషన్‌లో అప్రమత్తంగా ఉండండి

నంద్యాల(రూరల్): మానవ అక్రమ రవాణాలో భాగంగా రైల్వే స్టేషన్‌లో అనుమానస్పదకంగా తిరుగుతున్న వ్యక్తులు, చిన్న పిల్లలపై నిఘా ఉంచాలని నంద్యాల రైల్వే ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ భాస్కర్ సూచించారు. గురువారం స్థానిక ఆర్పీఎఫ్ పోలీస్ స్టేషన్‌లో మానవ అక్రమ రవాణా నిర్మూలన చర్యలపై స్థానిక సిబ్బందితో సమావేశం నిర్వహించారు. భాస్కర్ మాట్లాడుతూ రైల్వే ప్రాగణంలో రైల్వే హెల్ప్ లైన్ నంబర్ 139, చైల్డ్ హెల్ప్ లైన్ నంబర్ 1098 పై ప్రయాణికులకు అవగాహన కల్పించాలని చెప్పారు.

### మూడు చక్రాల బైక్ అందజేత

శిరివెళ్ల: యర్రగుంట్లకు చెందిన దివ్యాంగుడు యాపర్ల మధుమోహన్‌కు ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి ఎలక్ట్రిక్ మూడు చక్రాల బైక్‌ను గురువారం అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు గంగుల మనోహర్‌రెడ్డి, సర్పంచ్ సుభహాన్, ఉప సర్పంచ్ సత్తార్ ప్రతాపరెడ్డి, మాజీ మండల ఉపాధ్యక్షుడు గాజ కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

### వ్యక్తిపై దాడి..కేసు నమోదు

ఉయ్యాలవాడ : మండలంలోని రూపనగుడి గ్రామంలో మంగళి పుల్లయ్యపై అదే గ్రామానికి చెందిన మంగళి రమేష్, రామ్మోహన్, నరసింహుడు కలిసి గురువారం దాడి చేసి గాయపరచారు. ఇంటి దగ్గర గోడ విషయంలో జరిగిన వాగ్వాదం చివరకు ఘర్షణకు దారితీసింది. దీంతో ముగ్గురూ కలిసి పుల్లయ్యపై రాయితో దాడి చేశారు. గాయపడిన పుల్లయ్యను ఆళ్లగడ్డ ఆసుపత్రికి తరలించారు. బాధితుడి కుమారుడు సాయిదేవుడు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సత్యనారాయణ తెలిపారు.

### గణిత ఫోరం క్యాలెండర్ ఆవిష్కరణ

నంద్యాల(వ్యవసాయం): ఏపీ మ్యాథమెటిక్స్ ఫోరం 2023 సంవత్సరం క్యాలెండర్‌ను డీఈఓ అనురాధ గురువారం సాయంత్రం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా ఏపీఎంఎఫ్ సభ్యులు మల్లారెడ్డి, వెంకటసుబ్బయ్య, జగన్‌మోహన్‌రెడ్డి, విజయ, విద్యావతి, కుపేంద్ర, సతీష్, మధుసూదన్ పాల్గొన్నారు.

### గోదాదేవిని స్మరిస్తే స్వామికి ఆనందం

నంద్యాల(వ్యవసాయం): గోదాదేవి అమ్మవారిని కీర్తిస్తే శ్రీకృష్ణ భగవానుడికి ఆనందం కలుగుతుందని గోపికలతో చెప్పే విధానాన్ని టీటీడీ బ్రహ్మోత్సవాల నిత్య కల్యాణ వ్యాఖ్యాత డాక్టర్ హయగ్రీవాచారి భక్తులకు వివరించారు. గురువారం సాయంత్రం శ్రీభగవత్ సేవా సమాజ్ టీటీడీ ఆల్వార్ దివ్య ప్రబంధ ప్రాజెక్టు ఆధ్వర్యంలో తిరుప్పావై ప్రవచనాల్లో భాగంగా 20వ రోజు 20వ పాశురాన్ని భక్తులకు వివరించారు.

### ఆదాయం మెరుగు పరుచుకోండి

నంద్యాల(అర్బన్): పొదుపు సంఘాల మహిళలు బ్యాంకు రుణాలను ఉపయోగించుకొని కుటుంబ ఆదాయాన్ని మెరుగు పరుచుకోవాలని నంద్యాల జిల్లా మెప్మా పీడీ నాగశివలీల తెలిపారు. స్థానిక కార్యాలయంలో మెప్మా ఆర్పీలతో గురువారం సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఆర్పీలు వారి పరిధిలోని సంఘాల సమావేశాలకు క్రమం తప్పకుండా హాజరు కావాలని సూచించారు. మురళీ, జిలానీ, సీఎంఎం భాస్కరరెడ్డి, సీఓలు, ఓబీలు, ఆర్పీలు పాల్గొన్నారు.

### విద్యార్థికి గాయాలు

బొమ్మలసత్రం: నంద్యాల పట్టణంలోని నెరవాటి స్కూల్ 4వ తరగతి విద్యార్థి ప్రణవ్ మెట్లపై నుంచి కిందపడి గాయాలపాలయ్యాడు. మంగళవారం సాయంత్రం పాఠశాల వదిలిన తర్వాత విద్యార్థులు ఒకరికొకరు తోసుకోవడంతో ప్రణవ్ కింద పడ్డాడు. ఇంటికి వెళ్లి తల్లిదండ్రులకు తెలపడంతో వారు శాంతిరాం ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించారు. బుధవారం మరింత విషమించి అపస్మారక స్థితికి చేరుకోవడంతో విద్యార్థి సంఘాలు డీఈఓ అనురాధ దృష్టికి తీసుకెళ్లారు. ఆమె ఆదేశాల మేరకు గురువారం ఎంఈఓ బ్రహ్మం పాఠశాలకు చేరుకుని విచారణ చేపట్టారు.

# పారదర్శకంగా ఉపాధి

- ఎన్ఎంఎంఎస్ యాప్‌తో పనుల కేటాయింపు
- 20 మందికి మించి కూలీలు ఉంటేనే యాప్ డౌన్‌లోడ్
- పెండింగ్ పనులకు ఆస్కారం లేకుండా చర్యలు
- నూతనంగా రూ.201.28 కోట్ల పనుల గుర్తింపు
- నకిలీ మస్టర్లకు చెక్

**ఉపాధి హామీ పథకం పనుల్లో పారదర్శకత పెంపొందించేందుకు ప్రభుత్వం నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తెచ్చింది. ఇప్పటికే పలు చోట్ల ప్రయోగాత్మకంగా అమలు చేసి ఫలితాలు ఆశించిన స్థాయిలో ఉండటంతో అమలుకు శ్రీకారం చుట్టింది. ఇందులో పనుల కేటాయింపులో క్రమపద్ధతి, పని చేసే చోటే హాజరు, నకిలీ మస్టర్లకు చెక్ పెట్టేలా చర్యలు చేపట్టింది. దీంతో కూలీలకు న్యాయం జరగడంతో పాటు పనులు పూర్తిస్థాయిలో పూర్తవడానికి అవకాశముంటుంది.**


ప్యాపిలి మండలం చంద్రపల్లి సమీపంలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు (ఫైల్)

నంద్యాల(రూరల్): ఉపాధి పనుల్లో పారదర్శకతే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. పక్కాగా పనులు నిర్వహించేందుకు ఎన్ఎంఎంఎస్ (నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టమ్) అనే సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ విధానంతో వేతనదారులు తమకు తోచినట్లు పనులు చేసేందుకు, సిబ్బంది మస్టర్లలో అవకతవకలకు పాల్పడే అవకాశం ఉండదు. ఇప్పటికే క్షేత్రస్థాయిలో జరుగుతున్న పనుల్లో ఎన్ఎంఎంఎస్‌ను ప్రయోగాత్మకంగా అమలు చేసి చూశారు. గతంలో ఈఎంఎంఎస్ (ఎలక్ట్రానిక్ మస్టర్ మేనేజ్‌మెంట్ సిస్టం)పై విస్తృతంగా ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో కొత్త విధానం అమలులోకి తీసుకొచ్చినట్లు సమాచారం. ప్రస్తుతం భూ అభివృద్ధిలో భాగంగా సరిహద్దు గట్లు, మొక్కల చుట్టూ కందకాలు, ఫాంపాండ్లు, ఫీడర్ చానల్స్, చిన్నచిన్న చెరువుల అభివృద్ధి పనులు డ్వామా ఆధ్వర్యంలో చేయిస్తున్నారు. ఆయా పనుల్లో కూలీల హాజరును కొత్త విధానంలో తీసుకుంటున్నారు.

**పంచాయతీకి 20 పనులు..**

గతంలో ఏడాదికి 200 నుంచి 250 పనులు గుర్తించి, ఏడాది పూర్తయినా సగం పనులు కూడా పూర్తికాని పరిస్థితి ఉండేది. కొత్త ఎన్ఎంఎంఎస్ విధానం ద్వారా నిర్ణయించిన పనుల్లో ఒక పని పూర్తయిన తర్వాతే మరొక పని చేసేందుకు అవకాశం ఉంటుంది. పంచాయతీకి కేవలం 20 పనులు కేటాయించేలా నూతన విధానం దోహదపడుతుంది. ఇందులో వరుస క్రమంలో పనులు చేపట్టాల్సి ఉంటుంది. దీంతో పనులు పెండింగ్‌లో ఉండకుండా నిర్ణయించిన పనులు క్రమపద్ధతిలో జరుగుతాయని అధికారులు పేర్కొంటున్నారు.

| జాబ్‌కార్డులు, కూలీల వివరాలు.. | |
|---|---|
| మండలాలు | 28 |
| గ్రామ పంచాయతీలు | 493 |
| జాబ్‌కార్డులు | 4.34 లక్షలు |
| వినియోగంలోనున్న జాబ్ కార్డులు | 2.19 లక్షలు |
| కూలీల సంఖ్య | 8.62 లక్షలు |
| హాజరవుతున్న కూలీలు | 3.95 లక్షలు |

**కొత్త విధానంలో..**

- ➡ 20 మందికి మించి కూలీలు ఉంటేనే యాప్ డౌన్‌లోడ్ అవుతుంది.
- ➡ ఉదయం 7 నుంచి 11గంటల వరకు, మళ్లీ మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు యాప్ పని చేస్తుంది.
- ➡ వేతనదారుల మస్టర్‌ను మేట్ జీపీఎస్ సహాయంతో పనిచేస్తుంది.

**రూ.201.28 కోట్ల పనుల గుర్తింపు..**

జిల్లా వ్యాప్తంగా ఉన్న 493 పంచాయతీల్లో 2023–24 కు సంబంధించి మొత్తం రూ.201.28 కోట్ల విలువైన పనులను గుర్తించారు. ఈ పనులకు మండల, జిల్లా పరిషత్‌లో అనుమతులు పొందేలా చర్యలు తీసుకోనున్నారు. జిల్లాలోని మేజర్ సాగునీటి కాల్వల అభివృద్ధిపై కూడా దృష్టి సారించారు.

**యాప్‌పై అవగాహన కల్పిస్తున్నాం**

ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన ఎన్ఎంఎంఎస్ యాప్ వినియోగంపై క్షేత్రస్థాయిలో అవగాహన కల్పిస్తున్నాం. ఈ విధానంతో కూలీలకు మేలు జరుగుతుంది. పనికి వచ్చిన వారికే మస్టర్ వేయాల్సి ఉంటుంది. పనికి రాని వారికి మస్టర్ వేయడం కుదరదు.

– శ్రీకళారెడ్డి, ఏపీఓ, నంద్యాల

**తప్పుడు మస్టర్లకు అవకాశముండదు**



ఎన్ఎంఎంఎస్ యాప్‌తో ఉపాధి పనుల్లో తప్పుడు మస్టర్లకు అవకాశం ఉండదు. ముఖ్యంగా గ్రామ స్థాయి అధికారులు నిజాయితీగా పనిచేస్తారు. గతంలో తప్పుడు మస్టర్ల వల్ల పని ఎక్కువ.. కూలీ తక్కువగా వస్తుండటంతో కూలీలు బాధపడే వారు. ఇక నుంచి ఆ పరిస్థితి ఉండదు.

– అబ్దుల్ రషీద్, ఎంపీటీసీ, అయ్యలూరు, నంద్యాల మండలం

**అవకతవకలకు తావుండదు**



ఎన్ఎంఎంఎస్ యాప్ ద్వారా పనుల్లో అవకతవకలకు తావుండదు. పని ప్రదేశాల్లోనే వేతనదారు ఫొటో తీసి యాప్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. ఆ తర్వాతే మస్టర్ వేయాలి. ఒక్కో గ్రూప్‌లో 20 మంది కూలీలుండాలి.

– రామచంద్రారెడ్డి, డ్వామా పీడీ, నంద్యాల

### భూ హక్కు పత్రాల పంపిణీ

శిరివెళ్ల: గోవిందపల్లె గ్రామంలో జగనన్న భూ రక్ష, భూ హక్కు కింద 400 మంది రైతులకు భూ హక్కు పత్రాలను తహసీల్దార్ షేక్ మొయిద్దీన్ గురువారం పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ సమగ్ర రీ సర్వే అనంతరం గ్రామంలో ఉన్న 723 మంది రైతులకు గాను మొదటి విడతగా 597 మందికి హక్కు పత్రాలు మంజూరయ్యాయని చెప్పారు. మిగిలిన వారికి త్వరలో పత్రాలు మంజూరవుతాయన్నారు. ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం, సర్పంచ్ మరియమ్మ, ఉప సర్పంచు ఇందూరి శేషారెడ్డి, ఇందూరి ప్రతాపరెడి పాల్గొన్నారు.

### ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయండి

ఉయ్యాలవాడ: మండలంలోని జగనన్న కాలనీల్లో చేపట్టిన ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని తహసీల్దార్ రవికుమార్ ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు సూచించారు. గురువారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో తహసీల్దార్, ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు మాట్లాడారు. అల్లూరు, హరివరం గ్రామాల్లో లబ్ధిదారులకు గృహాలు మంజూరు కాగా పురోగతిపై అసంతృప్తి వ్యక్తం చేశారు. కొత్తగా ఆర్.పాంపల్లె 46, సర్వాయిపల్లె 58, ఇంజేడు 54, ఉయ్యాలవాడ 120 గృహాలు మంజూరయ్యాయని తెలిపారు. డిప్యూటీ తహసీల్దార్ వెంకటస్వామి, ఆర్‌ఐ తులసీకృష్ణ, సత్తార్, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.

### ఈ–క్రాప్ వేగవంతం చేయండి

దొర్నిపాడు: రబీలో సాగు చేసిన పంటల ఈ–క్రాప్ నమోదు వేగవంతం చేయాలని మండల వ్యవసాయాధికారి శ్రీకృష్ణ గ్రామ వ్యవసాయ సహాయకులకు సూచించారు. గురువారం మండలంలోని డబ్ల్యూ. గోవిందిన్నె, డబ్ల్యూ. కొత్తపల్లె గ్రామాల్లో ఈ–క్రాప్ నమోదును పరిశీలించి, వైఎస్సార్ రైతు భరోసా కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ రైతులకు ప్రభుత్వ పథకాలు వర్తించాలంటే ఈ–క్రాప్ తప్పనిసరి అని చెప్పారు.

### 7 నుంచి ఆలిండియా మిల్లీ కౌన్సిల్ సమావేశం

నంద్యాల(అర్బన్): ఈనెల 7, 8వ తేదీల్లో కర్నూలులోని అబ్దుల్‌హక్ యునానీ మెడికల్ కళాశాల ఆవరణలో ఆలిండియా మిల్లీ కౌన్సిలర్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహిస్తున్నట్లు కౌన్సిల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముఫ్తీ ఖదీర్ మౌలానా తెలిపారు. స్థానిక కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడుతూ కర్నూలులో జరిగే సమావేశానికి జాతీయ ప్రధాన కార్యదర్శి హజరత్ ముస్తఫా రఫాయి జిలానీ హాజరవుతారన్నారు. 8న ఆదివారం ముస్లిం లాబోర్డు సమావేశం ఉంటుందని చెప్పారు. నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి గౌస్, జిల్లా అధ్యక్షుడు సయ్యద్ ఇసాక్ హాఫీసాబ్, ఉపాధ్యక్షుడు ఉస్మాన్ పాల్గొన్నారు.

### దుకాణాల వేలం మళ్లీ వాయిదా

నంద్యాల(సిటీ): పట్టణంలోనున్న మున్సిపల్ దుకాణాలకు గురువారం నిర్వహించాల్సిన బహిరంగ వేలం మరోమారు వాయిదా పడింది. గత నెల 22న మొదటి సారి జరగాల్సిన వేలాలను దుకాణాల మరమ్మతులు, మౌలిక సదుపాయాల కల్పన చేయలేదని వాయిదా వేశారు. కొన్ని దుకాణాలకు మరమ్మతులు చేయనందున వేలం వాయిదా వేస్తున్నట్లు కమిషనర్ రవిచంద్రా రెడ్డి తెలిపారు.

### ల్యాబ్ టెక్నీషియన్లకు అవగాహన

నంద్యాల(అర్బన్): రోగులకు సంబంధించిన రక్తపరీక్షల్లో సరైన ఫలితాలివ్వాలని డీఎంఅండ్‌హెచ్‌ఓ వెంకటరమణ సూచించారు. స్థానిక కార్యాలయంలో గురువారం జిల్లా స్థాయి ల్యాబ్ టెక్నీషియన్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీ మెడికల్ డైరీ, క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. అడిషనల్ డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ బాలాజీ, టీబీ మెడికల్ ఆఫీసర్ మల్లికార్జునరెడ్డి, జిల్లా మలేరియా అధికారి కామేశ్వరప్రసాద్, ఏఎంఓ వరప్రసాదరెడ్డి, ల్యాబ్ టెక్నీషియన్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రఘుబాబు, జిల్లా సెక్రటరీ అబ్దుల్‌రజాక్, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

## వంతెన నిర్మాణ పనుల పరిశీలన


ఆర్.పాంపల్లె సమీపంలో నిర్మిస్తున్న వంతెన పనులను పరిశీలిస్తున్న ఎంపీ పోచా

ఉయ్యాలవాడ: మండలంలోని ఆర్.పాంపల్లె గ్రామ సమీపంలో కుందరవాగుపై ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన పథకం కింద రూ. 5 కోట్లతో చేపట్టిన నూతన వంతెన నిర్మాణ పనులను నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి గురువారం పరిశీలించారు. ప్రస్తుతం వంతెన డెక్ స్లాబ్ పనులు చురుగ్గా సాగుతున్నాయి. పనుల్లో నాణ్యత పాటించాలని డీఈ వెంకటసుబ్బయ్యకు సూచించారు. డీఈ మాట్లాడుతూ నూతన వంతెన నిర్మాణాన్ని 7.50 మీటర్ల వెడల్పు, 115 మీటర్ల పొడువు, 6 మీటర్ల ఎత్తు వంతెన కింద భాగంలో 10 మీటర్ల వెడల్పుతో వర్షపు నీరు వెళ్లేందుకు 11 గండ్లతో హైలెవెల్ వంతెన నిర్మిస్తున్నామని వివరించారు. పనులను ఈ ఏడాది మే నాటికి పూర్తి చేస్తామని చెప్పారు.

## ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ వైద్య సేవలు


ఆపరేషన్ థియేటర్ ప్రారంభిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే

నంద్యాల(అర్బన్): ప్రైవేటు ఆసుపత్రులకు దీటుగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్య సేవలందుతున్నాయని ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్యే శిల్పా రవికిశోర్‌రెడ్డి తెలిపారు. ప్రభుత్వాసుపత్రిలో రూ.5కోట్లతో ఏర్పాటు చేసిన ఆపరేషన్ థియేటర్లను గురువారం ప్రారంభించారు. వారు మాట్లాడుతూ నంద్యాల జిల్లా సర్వజన ప్రభుత్వ ఆసుపత్రిలో ఏడు ఆపరేషన్ థియేటర్లు ప్రారంభమయ్యాయని, మరికొన్ని మిషన్లు రావాల్సి ఉందన్నారు. మార్క్‌ఫెడ్ చైర్మన్ పీపీ నాగిరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ మాబున్నిసా, రాష్ట్ర డైరెక్టర్లు సునిత అమృతరాజ్, శశికళారెడ్డి, వైద్యాధికారులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

## అలరించిన నాటక ప్రదర్శన


నాటక పోటీలను ప్రారంభిస్తున్న దృశ్యం

నంద్యాల(వ్యవసాయం): అజోవిబో కందాళం ఫౌండేషన్(అమెరికా), కళారాధన సాంస్కృతిక సంస్థల సంయుక్త నిర్వహణలో గురువారం సాయంత్రం స్థానిక మున్సిపల్ టౌన్‌హాల్‌లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి సాంఘిక నాటక పోటీల్లో భాగంగా మొదటి రోజు ప్రదర్శన ఎంతగానో ప్రేక్షకులను అలరించాయి. కళారాధన అధ్యక్షుడు డాక్టర్ మధుసూదనరావు, ఫౌండేషన్ వ్యవస్థాపకుడు అప్పాజోష్ల సత్యనారాయణ, డాక్టర్ రామకృష్ణారెడ్డి, గురురాఘవేంద్ర విద్యాసంస్థల చైర్మన్ దస్తగిరిరెడ్డి ముఖ్యఅతిథులుగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి నాటక పోటీలను ప్రారంభించారు. ప్రముఖ రంగస్థల కళాకారుడు వెంకటేశ్వరరావు మాట్లాడారు. అనంతరం డాక్టర్ రవికృష్ణకు కథానాటక పోటీల్లో పాల్గొనే నాటికల గ్రంథాన్ని అంకితం చేసి సన్మానించారు.

**ఆకట్టుకున్న నాటక ప్రదర్శనలు..**

బీఎం రెడ్డి దర్శకత్వంలో విశ్వశాంతి, కల్చరల్ అసోసియేషన్ హైదరాబాద్ వారు ప్రదర్శించిన మిస్టర్ వత్తాండు నాటిక, గుంటూరుకు చెందిన గంగోత్రి సంస్థ వైఎస్సార్ అవార్డు గ్రహీత నాయుడు గోపి దర్శకత్వంలో ప్రదర్శించిన తెల్లకలువ, నల్లకోయిల నాటిక, విజయవాడకు చెందిన హర్ష క్రియేషన్స్ వారి కత్తి శ్యాంప్రసాద్ దర్శకత్వంలో ప్రదర్శించిన స్వర్ణ కమలాలు నాటికలు ఆకట్టుకున్నాయి.

## విత్తన ధర నమోదు చేయాలి

నంద్యాల(అర్బన్): విత్తన డీలర్లు వాటికి సంబంధించిన లాట్ నంబరు, విత్తన రకం, ధరల వివరాలను బిల్లులో నమోదు చేసి రైతులకు ఇవ్వాలని ఏడీఏ రాజశేఖర్ తెలిపారు. సీడ్ ప్రాసెసింగ్ యూనిట్ యజమానులు ట్రూత్‌ఫుల్ లేబుల్ విత్తనాలు ప్యాకింగ్ చేస్తే కచ్చితంగా వైఎస్సార్ అగ్రిటెక్ ల్యాబుల్లో తేమ శాతం పరీక్ష, జన్యు స్వచ్ఛత, మొలక శాతాలను పరీక్ష చేయించుకొని ప్యాకింగ్ చేయాలని సూచించారు. స్థానిక కార్యాలయంలో గురువారం విత్తన దుకాణ డీలర్లు, సీడ్ ప్రాసెసింగ్ యూనిట్ల యాజమాన్యాలతో వేర్వేరుగా సమావేశం నిర్వహించారు. ఏఓ స్వప్నికారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఏడీఏ మాట్లాడుతూ రైతులకు ఎమ్మార్పీ కంటే అధిక ధరకు విక్రయిస్తే చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

## అవినీతి రహిత పాలనే ప్రభుత్వ లక్ష్యం


పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే శిల్పా రవి


పథకాల క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

నంద్యాల(అర్బన్): అవినీతి రహిత పాలనే లక్ష్యంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పాలన సాగిస్తోందని ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి పేర్కొన్నారు. రాజకీయాలకు అతీతంగా అర్హులైన వారందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలను పారదర్శకంగా అందజేస్తున్నామని చెప్పారు. గురువారం పట్టణంలోని 41వ వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. కౌన్సిలర్ పున్నా రాజేశ్వరి, మాజీ కౌన్సిలర్ పున్నా శేషయ్య, నాయకులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. అనంతరం ప్రతి గడపకు వెళ్లి పథకాల గురించి వివరించి బుక్‌లెట్ అందజేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ మాబున్నిసా, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, వార్డు నాయకులు శేషఫణి, మోహన్ పాల్గొన్నారు.

**పథకాల క్యాలెండర్ ముద్రణ అభినందనీయం..**

పట్టణంలోని 4వ వార్డుల్లో ఏడాదిలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాలకు సంబంధించిన క్యాలెండర్‌ను ముద్రించడం అభినందనీయమని నంద్యాల ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి తెలిపారు. నాల్గవ వార్డు కౌన్సిలర్ సయ్యద్ తబ్రేజ్ రూపొందించిన వార్డు అభివృద్ధి సంక్షేమ పథకాలకు సంబంధించిన క్యాలెండర్‌ను ఎమ్మెల్యే నివాసంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మాబున్నిసా, కౌన్సిలర్లతో కలిసి విడుదల చేశారు. చిన్నరామయ్య, తిరువీధి సురేష్, సుమశ్రీరవి, గౌండా రసూల్, అక్బర్, నాగపుల్లయ్య పాల్గొన్నారు.

**జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలి**

ఈనెల 12వ తేదీన స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో నిర్వహించే జాబ్ మేళాను నిరుద్యోగ యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి తెలిపారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడాప్, జిల్లా ఉపాధి కల్పన కార్యాలయం ఆధ్వర్యంలో నిర్వహించే మెగా జాబ్‌మేళాకు సంబంధించిన పోస్టర్లను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శశికళ, జిల్లా ఉపాధి కల్పనా అధికారి శివారెడ్డి, సీడాప్ అధికారి కిరణ్, నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ప్రతాపరెడ్డితో కలిసి ఎమ్మెల్యే నివాసంలో గురువారం విడుదల చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ 13 జాతీయ కంపెనీలు ఇంటర్వ్యూలు నిర్వహిస్తాయని చెప్పారు. ఉపాధి కల్పన అధికారి శివారెడ్డి మాట్లాడుతూ 18 - 30ఏళ్ల మధ్య వయస్సు వారు అర్హులన్నారు. 10వ తరగతి, ఐటీఐ, డిప్లొమా, ఇంటర్, డిగ్రీ, బీటెక్, పీజీ పూర్తి చేసిన వారు వినియోగించుకోవాలని కోరారు. అభ్యర్థులు విద్యార్హత పత్రాలు, ఆధార్ కార్డు, రెండు ఫొటోలతో రావాలని సూచించారు. వివరాలకు www.apssdc.in లేదా సెల్ 9533631002, 6303397635 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

## పథకాలతో ప్రతి గడపలో సంతోషం


పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే గంగుల

రుద్రవరం: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో పేదల్లో సంతోషం వ్యక్తమవుతోందని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి పేర్కొన్నారు. గడప గడపకు కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో లబ్ధిదారులు, ప్రజల నుంచి లభిస్తున్న ఆదరణే ఇందుకు నిదర్శనమన్నారు. ప్రజలు పూలజల్లి, హారతుల పట్టి స్వాగతిస్తున్నారని, తమకు జగనన్న పాలనలో అందిన పథకాల గురించి వారే వివరిస్తుండటం సంతోషాన్నిస్తోందని, అలాగే పథకాల అమలుతో జగనన్న పేదల హృదయాల్లో చిరస్థానం సంపాదించుకున్నారని చెప్పారు. గురువారం స్థానిక సచివాలయం –2 పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరిగి పథకాలు, లబ్ధిని వివరించి బుక్‌లెట్ అందజేశారు. కార్యక్రమంలో పుట్టాలమ్మ క్షేత్రం చైర్మన్ గంగుల మనోహర్‌రెడ్డి, డైరెక్టర్ గంగిశెట్టి తిమ్మయ్య, మార్కెట్‌యార్డు చైర్మన్ రాఘవరెడ్డి, సింగిల్ విండో చైర్మన్ నాగేశ్వరరెడి, డైరెక్టర్ కృష్ణమూర్తి, ఎంపీపీ బాలస్వామి, నాయకులు వెంకటేష్, కొల్లంపుల్లయ్య, జాకీర్, మద్దిలేటయ్య, బైరీ హరి, బ్రహ్మం, శంకర్, మహేశ్వరరెడ్డి, బాలీశ్వరరెడ్డి ఎంపీడీఓ మధుసూదన్ రెడ్డి, తహసీల్దార్ వెంకటశివ పాల్గొన్నారు.

**ఇంటి సమస్య తీరింది..**

చిత్రంలో ఎమ్మెల్యే నుంచి గృహ మంజూరు పత్రం అందుకుంటున్న మహిళ పేరు వేదకుమారి. మండల కేంద్రంలోని దళిత కాలనీ వాసి. గతంలో ఇంటి కోసం అధికారుల చుట్టూ ఎన్నో సార్లు తిరిగినా తనకు ఇల్లు మంజూరు కాలేదు. జగనన్న పాలనతో సొంత స్థలంలో పక్కా గృహ నిర్మాణానికి దరఖాస్తు చేసుకోగా వెంటనే మంజూరైందని పేర్కొంది. గృహ నిర్మాణానికి రూ.5వేలు తన బ్యాంకు ఖాతాలో జమ చేశారని, వెంటనే పనులు చేపడతానని సంతోషం వ్యక్తం చేసింది.


వేదకుమారికి గృహ మంజూరు పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే

**ఎమ్మెల్యే చొరవతో సమస్య పరిష్కారం**

మండలంలోని ఆర్.నాగులవరంలో రజకులు గ్రామస్తుల దుస్తులు శుభ్రం చేసేందుకు నీటి వసతి లేక ఇబ్బందులు పడేవారు. సమస్యను గంధం రాఘవరెడ్డి ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన గురువారం బోరు వేయించారు.

# అర్హులకే పింఛన్లు


పింఛన్లను పంపిణీ చేస్తున్న ఎంపీపీ


పింఛన్ సొమ్మును అందజేస్తున్న ఎంపీపీ అమర్‌నాథ్ రెడ్డి


ఉయ్యాలవాడలో రాములమ్మకు కొత్త పింఛన్ అందజేస్తున్న ఎంపీపీ బుడ్డాభాగ్యమ్మ


ఆర్.నాగులవరంలో కొత్త పింఛన్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

దొర్నిపాడు: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పథకాలు వర్తించాలంటే అర్హత మాత్రమే ఉండాలని ఎంపీపీ అమర్‌నాథ్‌రెడ్డి పేర్కొన్నారు. టీడీపీ హయాంలో లాగా జన్మభూమి కమిటీలు, నాయకుల సిఫారసులు, చేతులు తడపడాలు ఇవేవీ లేవని చెప్పారు. గురువారం స్థానిక వైఎస్సార్ క్రాంతిపథం కార్యాలయంలో నూతన పింఛన్లను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ మండలానికి నూతనంగా 110 పింఛన్లు మంజూరయ్యాయన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ శకుంతల, సొసైటీ చైర్మన్ భూమా చెంచిరెడ్డి, యాదవ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ బత్తుల నాగేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మోహన్‌నాయుడు, సర్పంచులు శివరామిరెడ్డి, మాధవీలత, ఉమాదేవి, పద్మిని, సచివాలయ కన్వీనర్లు శ్రీపతి ప్రసాద్, రఫీ, సురేఖ, శాంతయ్య, శంకర్‌రెడ్డి, ఎంపీటీసీలు సావిత్రి, రాధ, మహబూబ్‌బాషా పాల్గొన్నారు.

ఉయ్యాలవాడ: అర్హులందరికీ ప్రభుత్వం పింఛన్ అందజేస్తుందని ఎంపీపీ బుడ్డా భాగ్యమ్మ అన్నారు. గురువారం పింఛన్ వారోత్సవాల్లో భాగంగా మండలంలోని 20 గ్రామ పంచాయతీల్లో పింఛన్ల పంపిణీ పండుగలా నిర్వహించారు. మండలానికి నూతన సంవత్సర కానుకగా 90 మందికి పింఛన్లు మంజూరయ్యాయి. స్థానిక గ్రామ సచివాలయంలో సర్పంచ్ మేకల ఓబులేస్ అధ్యక్షతన 16 మందికి రైతు సలహా మండలి చైర్మన్ పోచా రాధాకృష్ణారెడ్డి, ఎంపీటీసీ జి వెంకటేశ్వర్లు సర్పంచ్, ఎంపీడీఓ ఉమామహేశ్వరరావుతో కలిసి పింఛన్లు పంపిణీ చేశారు.

రుద్రవరం: వైఎస్సార్ పింఛన్ కానుక వారోత్సవాల్లో భాగంగా గురువారం మండలంలోని ఆర్.నాగులవరం, ఎల్లావత్తుల గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు ఆదిలక్ష్మి, పాములేటి, ఆళ్లగడ్డ వ్యవసాయ మార్కెట్‌యార్డు కమిటీ చైర్మన్ గంధం రాగవరెడ్డి, సర్పంచులు గంధం సావిత్రమ్మ, చంద్రమోహన్ కొత్తగా మంజూరైన పింఛన్లు పంపిణీ చేశారు.

ఆళ్లగడ్డ: వైఎస్సార్ పింఛన్ పెంపుతో అవ్వతాతల ఆనందాన్ని కళ్లారా చూస్తున్నామని ఎంపీపీ వీరభద్రుడు పేర్కొన్నారు. గురువారం చాగలమర్రి మండలంలోని చింతలచెరువు, పెద్దవంగళి, చిన్నవంగళి గ్రామాల్లో నూతన పింఛన్లను పంపిణీ చేశారు. వైఎస్సార్‌సీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ బాబులాల్, మండల కన్వీనర్ కుమార్‌రెడ్డి, జెడ్పీటీసీ లక్ష్మీదేవి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు రామగురివిరెడ్డి, వైస్ ఎంపీపీ ముల్లా రఫీ, సర్పంచులు బంగారు షరీఫ్, మహబూబ్‌బాషా పాల్గొన్నారు.

శిరివెళ్ల: తమది చేతల ప్రభుత్వమని జెడ్పీ వైస్ చైర్మన్ దిల్షాద్ నాయక్, వక్ఫ్‌బోర్డు జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు బి.అబ్దుల్ సలాం, ఎంపీపీ నాయక్ వసీం అన్నారు. గురువారం వైఎస్సార్ పింఛన్ల కానుక వారోత్సవాల్లో భాగంగా మండలంలో 254 కొత్త పింఛన్లు పంపిణీ చేశారు. మార్కెట్ యార్డు ఉపాధ్యక్షుడు నరహరి, సర్పంచులు సాలమ్మ, అయ్యలూరి సుభహాన్, మేర్వ చిన్న నరసింహారెడ్డి, దూదేకుల ఉశేనీబీ, పెద్ది రమణయ్య, కందుల మల్లేశ్వరి, మందాల రాధిక, మరియమ్మ, ఉప సర్పంచులు ఇంతియాజ్, సత్తార్ ప్రతాపరెడ్డి, గాజ కృష్ణారెడ్డి పాల్గొన్నారు.